సాక్షి నాగర్‌కర్నూల్

మంగళవారం, 16, మే, 2023



నేటినుంచి డిగ్రీ ప్రవేశాలు

దోస్త్‌లో డిగ్రీ ప్రవేశాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ మంగళవారం ప్రారంభం కానుంది.

వివరాలు 8లో ▸



రోడ్డెక్కిన రైతులు

ధాన్యం కొనుగోలులో మిల్లర్లు మోసం చేస్తున్నారని రైతులు ఆందోళనకు దిగారు.

వివరాలు 8లో ▸

గరిష్టం/కనిష్టం 41.2 /27.0

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండగా ఉంటుంది. వేడిగాలులు వీస్తాయి. ఉక్కపోత ఉంటుంది.

న్యూస్‌రీల్

ఫిర్యాదులను సత్వరం పరిష్కరించాలి



నాగర్‌కర్నూల్: ప్రజావాణి ద్వారా అందిన ఫిర్యాదులను పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ ప్రజావాణి మందిరంలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి కలెక్టర్ మొత్తం 20 ఫిర్యాదులను స్వీకరించారు. ప్రతీ దరఖాస్తును పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ధరణి సమస్యలపై వచ్చిన ఫిర్యాదులను కలెక్టర్ లాగిన్‌లో ఉన్న దరఖాస్తులను అప్పటికప్పుడు పరిష్కరించారు. అదనపు కలెక్టర్ మనూ చౌదరి, డీఆర్‌డీఓ నర్సింగరావు, సీపీఓ భూపాల్‌రెడ్డి, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

దోస్త్ ద్వారా అడ్మిషన్లు



కొల్లాపూర్: దోస్త్ ద్వారా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు చేపట్టనున్నట్లు కొల్లాపూర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మల్లేశం వెల్లడించారు. మంగళవారం నుంచి ఆన్‌లైన్ ద్వారా అడ్మిషన్ల కోసం విద్యార్థులుదరఖాస్తులు చేసుకోవాలని ఆయన సూచించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు కల్పించిన సౌకర్యాలు, కోర్సుల వివరాలతో కూడిన బ్రోచర్లను గ్రామాల్లో పంచుతున్నట్లు వివరించారు. ఈ బ్రోచర్లను సోమవారం ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరింపజేశారు. బీఏ, బీకాం, బీఎస్సీ తో పాటు కంప్యూటర్ కోర్సుల్లో అడ్మిషన్ల కోసం ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకునే విద్యార్థులు సెల్‌నెం .9493603075, 8519991419 లకు ఫోన్‌చేసి పూర్తి వివరాలు తెలుసుకోవచ్చన్నారు.

ని'బంధన'ల మధ్య చెంచులు



మన్ననూర్ ఐటీడీఏ కార్యాలయం

- కనీస వసతుల్లేక జీవనం దుర్భరం
- అడవులపై ఆంక్షలు, కొరవడిన ప్రభుత్వ చేయూత
- ఎనిమిదేళ్లుగా ఊసేలేని ఐటీడీఏ పాలక మండలి సమావేశం
- నేడు నల్లమల ప్రాంతంలో గిరిజన మంత్రి పర్యటన

అచ్చంపేట: ఉండేందుకు గూడులేక.. కనీస వసతులు కరువై.. అటవీ ప్రాంతంలో దుర్భర జీవనం సాగిస్తున్నారు చెంచులు. మరోవైపు పులుల సంరక్షణ పేరుతో నిబంధనలు విధించడంతో జీవనోపాధి దొరక్క.. యురేనియం వెలికితీతతో ఉన్న కొద్దిపాటి ప్రశాంతత కరువైంది. నల్లమల అడవిని నమ్ముకొని జీవనం కొనసాగిస్తున్న చెంచులకు ప్రభుత్వం నుంచి చేయూత కరువైంది. రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ మంత్రి సత్యవతి రాథోడ్ రెండోసారి అచ్చంపేట నియోజకవర్గంలో మంగళవారం పర్యటిస్తుండటంతో తమ సమస్యలు పరిష్కరిస్తారనే ఆశాభావంతో చెంచులు ఉన్నారు.

ఐటీడీఏపై శీతకన్ను

మన్ననూర్ సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ(ఐటీడీఏ)పై ప్రభుత్వం శీతకన్ను చూపుతుంది. మూడు నెలలకోసారి ఐటీడీఏ పాలకమండలి సమావేశమై అభివృద్ధి, సంక్షేమ పథకాలపై చర్చించాలి. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఒకసారి కూడా నిర్వహించ లేదు. దీంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వస్తున్న నిధుల వినియోగం, పథకాల అమలుపై సమీక్ష చేయడానికి వీలులేకుండా పోయింది. రాష్ట్రంలో ఉన్న మూడు సమీకృత గిరిజనాభివద్ధి సంస్థ(ఐటీడీఏ)ల్లో మన్ననూర్ ఒకటి. ఐటీడీఏ పరిధిలో నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్, నల్గొండ, వికారాబాద్, రంగారెడ్డి జిల్లాలు ఉన్నాయి. ఈ జిల్లాలకు చెందిన జెడ్పీటీసీలు, ఎంపీపీలు, జెడ్పీచైర్మన్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, మంత్రులు హాజరై సమీక్ష, చర్చ చేపట్టాలి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కర్నూల్ జిల్లా సున్నిపెంటలో 1988లో ఐటీడీఏ ఏర్పాటు చేశారు. రాష్ట్ర విభజనలో సున్నిపెంట నుంచి విడిపోయి 2015 మార్చి20న అచ్చంపేట నియోజకవర్గంలోని మన్ననూర్‌లో ఐటీడీఏను ఏర్పాటు చేశారు.

మంత్రికి ఘన స్వాగతం

మన్ననూర్: మంత్రి సత్యవతి రాథోడ్ సోమవారం శ్రీశైలం దైవదర్శనానికి వెళ్తుండగా.. మార్గ మధ్యలో మన్ననూర్ అటవీశాఖ విశ్రాంతి గృహం వద్ద అధికారులు, బీఆర్ఎస్ నాయకులు ఆమెకు స్వాగతం పలికారు. విశ్రాంతి గృహంలో కాసేపు సేద తీరిన ఆమె శ్రీశైలం పుణ్యక్షేత్రానికి బయలుదేరి వెళ్లారు. స్వామి వారిని దర్శించుకుని రాత్రికి అక్కడే బసచేసి మంగళవారం మన్ననూర్‌కు చేరుకోనున్నారు. స్వాగతం పలికిన వారిలో డీటీడీఓ కమలాకర్‌రెడ్డి, జాఫర్ ఉసేన్, రవిందర్‌రెడ్డి, చెన్నకేశవులు ఉన్నారు.

కీలక పోస్టులన్నీ ఖాళీ..

మన్ననూర్ ఐటీడీఏలో ప్రధాన విభాగాల్లో కీలక పోస్టులన్నీ ఖాళీగా ఉన్నాయి. ఐఏఎస్ అధికారి ప్రాజెక్టు అధికారిగా ఉండాల్సి ఉన్నా ప్రభుత్వం ఇంత వరకు పోస్టు మంజూరు చేయలేదు. ప్రస్తుతం కలెక్టర్ ఉదయ్‌కుమార్ ఇన్‌చార్జ్ పీఓగా కొనసాగుతున్నారు. ఫలితంగా పనుల కోసం ఐటీడీఏకు వస్తున్న గిరిజనులు చేసేదేమీ లేక వెనుదిరిగి వెళ్లాల్సిన పరిస్థితి ఎదరవుతోంది. చెంచుల కోసం అమలు చేస్తున్న అనేక పథకాలపై పర్యవేక్షణ కొరవడి నత్తనడక సాగుతున్నాయి. కార్యాలయం మొత్తంలో ఒక సీనియర్ అసిస్టెంట్ విధులు నిర్వహిస్తుండడం గమనార్హం.

చిత్తశుద్ధి కరువు

గిరిజనులకు సంబంధించి విద్య, వైద్యం, ఇతర మౌళిక సదుపాయాల కల్పన, నీటిపారుదల, వ్యవసాయం, గిరివికాస్, తదితర రుణాలు, అంశాల అమలుకు ఐటీడీఏ ఏర్పాటు చేసినప్పటికీ పాలకులు, అధికారుల్లో చిత్తశుద్ధి కరువైంది. గిరిజనాభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు విడుదల చేస్తున్నారు. పాలకమండలి సమావేశం నిర్వహిస్తే సమస్యలు చర్చకు రానున్నాయి.

మన్ననూర్ ఐటీడీఏ పరిధిలో..

జిల్లాలు: నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్, నల్లగొండ, వికారాబాద్, రంగారెడ్డి

మండలాలు	గ్రామాలు	చెంచు కుటుంబాలు	గిరిజన జనాభా	మొత్తం పోస్టులు (అన్ని విభాగాల్లో కలిపి)
25	173	4,041	14,436	20

ప్రస్తుత ఖాళీలు 19

3 సెగ్మెంట్లు.. 12 రోజులు.. 150 కి.మీ.లు

పాలమూరులో భట్టి యాత్ర

- నేడు నవాబుపేట మండలంలోకి ప్రవేశం
- 9 మండలాల్లో పర్యటించనున్న సీఎల్పీ నేత
- 3 ప్రాంతాల్లో కార్నర్ మీటింగ్‌లు
- కాంగ్రెస్ శ్రేణుల్లో జోష్



సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: పాలమూరులో హాథ్ సే హాథ్ జోడో పాదయాత్రకు రంగం సిద్ధమైంది. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్రకు కొనసాగింపుగా పీపుల్స్ మార్చ్ పేరిట ఆ పార్టీ శాసనసభా పక్ష నేత మల్లు భట్టి విక్రమార్క ఆదిలాబాద్ నుంచి ఖమ్మం వరకు పాదయాత్ర నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈ మేరకు రంగారెడ్డి జిల్లా నుంచి మంగళవారం సాయంత్రం మహబూబ్‌నగర్ జిల్లాలోకి ప్రవేశించనుంది. మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో 12 రోజుల పాటు 150 కిలోమీటర్ల మేర భట్టి పాదయాత్ర చేస్తూ.. ప్రజల సమస్యలను తెలుసుకోనున్నారు. అదేవిధంగా మూడు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌ల ద్వారా ఆయన ప్రజలనుద్దేశించి మాట్లాడనున్నారు.

కార్నర్ మీటింగ్‌లు ఇలా..

తేదీ	నియోజకవర్గం	సభా వేదిక
19	జడ్చర్ల	జడ్చర్ల డిగ్రీ కాలేజీ
24	అచ్చంపేట	అచ్చంపేట పట్టణం
27	అచ్చంపేట	ఎస్ఎల్‌బీసీ వద్ద

తొలి రోజు యాత్ర ఇలా..

భట్టి పాదయాత్ర రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ నియోజకవర్గ పరిధిలోని గుంజల్‌పహాడ్ నుంచి మంగళవారం సాయంత్రం మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండలం కిలిత్‌నగర్‌లోకి ప్రవేశించనుంది. కేశవరావుపల్లి, కొల్లూరు, వెంకటేశ్వరతండా వరకు తొలి రోజు ఐదు కిలోమీటర్ల మేర యాత్ర కొనసాగనుంది. వెంకటేశ్వర తండాలోనే ఆయన రాత్రి బస చేయనున్నారు.

సుమారు 62 గ్రామాల మీదుగా..

పాలమూరులో భట్టి పాదయాత్ర ఈ నెల 16న ప్రారంభం కానుండగా.. 27వ తేదీ వరకు కొనసాగనుంది. ఇదే రోజున అచ్చంపేట నియోజకవర్గ పరిధిలోని డిండి ప్రాజెక్ట్ మీదుగా నల్లగొండ జిల్లా దేవరకొండ నియోజకవర్గంలోని నక్కలగండి తండాకు చేరుకోనుంది. ఉమ్మడి జిల్లాలో జడ్చర్ల, నాగర్‌కర్నూల్, అచ్చంపేట నియోజకవర్గాల్లోని నవాబ్‌పేట, జడ్చర్ల, తిమ్మాజిపేట, బిజినేపల్లి, తాడూరు, నాగర్‌కర్నూల్, తెలకపల్లి, బల్మూర్, అచ్చంపేట మండలాల పరిధిలో సుమారు 62 గ్రామాల మీదుగా యాత్ర కొనసాగనుంది.

'పాలమూరు-రంగారెడ్డి'పైనే ప్రధానంగా..

భట్టి పాదయాత్రలో భాగంగా పాలమూరు, రంగారెడ్డి జిల్లాలను సస్యశ్యామలం చేసే పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్ట్ నిర్మాణంలో జరుగుతున్న జాప్యం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న తీరుపై ప్రధానంగా ఎండగట్టే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ ప్రాజెక్ట్‌లో భాగంగా తొలుత జడ్చర్ల నియోజకపరిధిలో నిర్మిస్తున్న ఉదండాపూర్ రిజర్వాయర్‌కు సంబంధించి నిర్వాసితులతో ముచ్చటించనున్నట్లు సమాచారం. కాగా, భట్టి పాదయాత్రకు సంబంధించి డీసీసీ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డితో పాటు టీపీసీసీ నేతలు జనంపల్లి అనిరుధ్‌రెడ్డి, ఒబేదుల్లా కొత్వాల్, సంజీవ్ ముదిరాజ్, వినోద్‌కుమార్, ప్రదీప్‌గౌడ్ తదితర నేతలు పలు మార్లు భేటీ అయ్యారు. జన సమీకరణ తదితర ఏర్పాట్లపై చర్చించి.. ఆ మేరకు ఏర్పాట్లు చేస్తున్నారు. తాజా పరిస్థితుల్లో సమీప రాష్ట్రమైన కర్ణాటకలో కాంగ్రెస్ గెలుపు ఆ పార్టీ శ్రేణులకు ఊపిరినిచ్చింది. రాష్ట్రంలో సైతం అధికారంలోకి వచ్చేలా.. నేతలు పాలమూరుపై నజర్ పెట్టి వరుస యాత్రలు నిర్వహిస్తుండడంతో కార్యకర్తల్లో ఉత్సాహం తొణికిసలాడుతోంది.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం


శంకర్ (ఫైల్)

భూత్పూర్: మండలంలోని తాటిపర్తి సమీపంలో సోమవారం రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం చెందినట్లు ఎస్ఐ భాస్కర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని కొత్తూర్ చెందిన బోయిని శంకర్ (38) దివిటిపల్లికి మోటర్‌సైకిల్‌పై బయలుదేరాడు. తాటిపర్తి సమీపంలోని బీటీరోడ్డు పక్కన ఆరబెట్టిన వరి ధాన్యంపై నుంచి వెళ్తూ అకస్మాత్తుగా జారి పడ్డాడు. శంకర్ తలకు బలమైన గాయాలు కాగా, వెనుకనే వస్తున్న ధనుంజయులు గమనించి అంబులెన్స్‌లో జిల్లా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతిచెందాడు. మృతుడి భార్య అలివేల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ద్విచక్రవాహనం అదుపుతప్పి వ్యక్తి మృతి


మిద్దెరాజు (ఫైల్)

గోపాల్‌పేట: ద్విచక్రవాహనం అదుపు తప్పి వ్యక్తి మృతి చెందిన ఘటన రేవల్లి మండలంలోని నాగపూర్ సమీపంలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్ఐ శివకుమార్ తెలిపిన వివరాల మేరకు.. బండరావిపాకులకు చెందిన మిద్దెరాజు (39) ఆదివారం కొత్త బండరావిపాకులకు వచ్చాడు. రాత్రి 10గంటల ప్రాంతంలో కొత్త బండరావిపాకుల నుంచి పాత బండరావిపాకులకు ద్విచక్రవాహనంపై బయలుదేరాడు. మార్గమధ్యంలో నాగపూర్ సమీపంలో వాహనం అదుపు తప్పి రోడ్డుపక్కన పడిపోయాడు. గాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందాడు. రోడ్డుపై వెళ్తున్న వాహనదారులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. సోదరుడు మిద్దె శ్రీరాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తిని ఢీకొన్న బైక్

మద్దూరు: రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తిని బైక్‌ఢీ కొట్టడంతో మృతి చెందిన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. ఎస్ఐ శీనయ్య తెలిపిన వివరాల ప్రకారం.. గుండుమాల్ చెందిన లింగనోళ్ల బాలప్ప(60) ఆదివారం కోస్గి సంతకు వెళ్లాడు. అనంతరం ఆర్టీసీ బస్సులో తిరుగు ప్రయాణమయ్యాడు. ఈ క్రమంలో బస్సులో నిద్రపోవడంతో గుండుమాల్ దాటి మద్దూరు మండలంలోని పల్లెగడ్డ గేటు వద్ద దిగాడు. గుండుమాల్‌వైపు నడుచుకుంటూ వెళ్తున్న క్రమంలో మద్దూరు నుంచి బైక్ వేగంగా వచ్చి ఢీ కొట్టడంతో తలకు, ముఖానికి, కాళ్లకు, చేతులకు గాయాలయ్యాయి. ఘటన చూసిన పల్లెగడ్డ వాసులు అంబులెన్స్‌లో ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతుడి భార్య నాగమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

వాకింగ్‌కు వెళ్లి.. బావిలో శవమయ్యాడు


జశ్వంత్ నాయుడు (ఫైల్)

ఉండవెల్లి: మండలంలోని తక్కశీలకు చెందిన బాలుడు వాకింగ్ వెళ్లి బావిలో శవమై తేలాడు. సోమవారం ఎస్ఐ బాల్‌రాజు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన ముగ్గురు బాలురు ఉదయాన్నే వాకింగ్ అని వెళ్లారు. ముగ్గురిలో ఇద్దరు ఇంటికి చేరారు. అందులో జశ్వంత్‌నాయుడు ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు గ్రామంలో గాలించారు. దీంతో తండ్రి వెంకటేశ్వర్లు పోలీసులకు సమాచారం ఇవ్వగా, గాలింపు చేపట్టారు. బావి వద్ద అతని చెప్పులు కనబడడంతో, అందులో వెతకగా బాలుడి మృతదేహం లభ్యమైంది. బాలుడు ఇటిక్యాల మండలం బీచుపల్లి గురుకుల పాఠశాలలో 9వ తరగతి పూర్తి చేసినట్లు పోలీసులు తెలిపారు. వెంకటేశ్వర్లు, చెన్నమ్మ దంపతులకు కుమారుడు, కుమార్తె ఉన్నారని స్థానికులు తెలిపారు.

ఉరేసుకుని వివాహిత బలవన్మరణం

గద్వాల క్రైం: వివాహిత బలవన్మరణానికి పాల్పడిన సంఘటన జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. పట్టణ రెండవ ఎస్ఐ అబ్దుల్ షుకూర్ తెలిపిన వివరాల ప్రకారం.. కడప జిల్లా చెన్నూరుకు చెందిన కమతం హేమలత (32), అదే గ్రామానికి చెందిన ఆర్మీ ఉద్యోగి నరేంద్రతో నాలుగేళ్ల క్రితం వివాహమైంది. హేమలత తండ్రి సుధాకర్ గద్వాల పట్టణంలోని ఎస్‌బీఐలో సెక్యూరిటీ గార్డుగా కొన్నేళ్లుగా విధులు నిర్వహిస్తూ నల్లకుంట కాలనీలో అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నాడు. రెండేళ్ల క్రితం హేమలతకు ప్రసవ సమయంలో పురిటోనే శిశువు మృతి చెందగా, తల్లిదండ్రుల వద్దకు వచ్చి ఉంటుంది. అప్పటి నుంచి తీవ్రమైన ఒత్తిడి, భర్త విధి నిర్వహణలో దూరంగా ఉండడంతో మానసికంగా కుంగిపోయింది. దీంతో సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పై కప్పు రాడ్‌కు చీరతో ఉరేసుకుంది. శనివారం కుటుంబసభ్యులు బంధువుల శుభకార్యానికి వెళ్లి సోమవారం సాయంత్రం ఇంటికి వచ్చారు. తలుపులు తీసేందుకు కూతురును పిలవగా ఫలితం లేకపోయింది. స్థానికుల సాయంతో తలుపులను ధ్వంసం చేసి చూసేసరికి ఉరేసుకుంది. తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

నేటి నుంచి డిగ్రీ ప్రవేశాలు


పీయూ ముఖద్వారం

- దోస్త్ వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ
- పీయూ పరిధిలో 88 డిగ్రీ కళాశాలలు.. 29,740 సీట్లు
- అడ్మిషన్లకు ప్రత్యేక యాప్ అందుబాటులోకి..
- రిజర్వేషన్ల ఆధారంగా సీట్ల కేటాయింపు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీ పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాలకు మంగళవారం నుంచి దరఖాస్తుల స్వీకరణకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. పీయూ పరిధిలో బీఏ, బీకాం, బీబీఏ, బీఎస్సీ, బీఎస్‌డబ్ల్యూ తదితర కోర్సులు ఉండగా.. ఇంటర్ పూర్తిచేసిన విద్యార్థులు దోస్త్ వెబ్‌సైట్‌లో రూ.200 రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. పీయూ పరిధిలో 88 డిగ్రీ కళాశాలలు ఉండగా.. 29,740 సీట్లు అందుబాటులో ఉన్నాయి. వీటిలో అత్యధికంగా బీఎస్సీకి 13,910 సీట్లు ఉండగా.. బీఎస్‌డబ్ల్యూకు కేవలం 60 సీట్లు మాత్రమే ఉన్నాయి. అయితే ప్రతి ఏడాది ఉన్న సీట్లలో కేవలం 60 శాతం మాత్రమే భర్తీ అవుతున్నాయి. ఇది ప్రైవేటు కళాశాలలపై తీవ్ర ప్రభావం చూపుతుంది. ఒక కోర్సులో నిర్ణీత సంఖ్య కంటే తక్కువ సీట్లు భర్తీ అయితే సంబంధిత కోర్సు విద్యార్థులను అధికారులు ఇతర కళాశాలకు అటాచ్ చేసే పరిస్థితి ఉంది. చాలామంది విద్యార్థులు మొదటి ఆప్షన్ ప్రభుత్వ కళాశాలలకు ఇచ్చి తర్వాత ప్రైవేటు కళాశాలలకు ప్రాధాన్యం ఇస్తున్నారు. దీంతో ప్రైవేటు కళాశాలల్లో సీట్లు మిగిలిపోతున్నాయి. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల ఆధారంగా సీట్లు భర్తీ చేయనున్నారు.

రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఇలా..

దరఖాస్తు ప్రక్రియను సులభతరం చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా దోస్త్ మొబైల్ యాప్‌ను కూడా అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇందులో విద్యార్థుల ఆధార్ నంబర్‌కు లింక్ చేసిన సెల్‌నంబర్‌కు ఓటీపీ వస్తుంది. దాని ఆధారంగా లాగిన్ అవ్వాల్సి ఉంటుంది.

- మీ–సేవా కేంద్రాలు, టీ–యాప్ ఫోలియోలో కూడా దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉంది. విద్యార్థులు ఇంటర్ హాల్‌టికెట్ నంబర్, డేట్ ఆఫ్ బర్త్, ఆధార్, మొబైల్ నంబర్ల ద్వారా నమోదు చేసుకోవాలి. రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు విద్యార్థులు రూ.200 చెల్లించాల్సి ఉంటుంది. వచ్చే నెల రెండోసారి కూడా రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు అవకాశం ఉండగా.. అప్పుడు ఫీజు రూ.400 చెల్లించాల్సి ఉంటుంది.
- దరఖాస్తు చేసుకొనే క్రమంలో ఏవైనా సమస్యలు తలెత్తితే జిల్లాకేంద్రంలోని ఎంవీఎస్ డిగ్రీ కళాశాలలోని హెల్ప్‌లైన్ కేంద్రానికి వెళ్లి పరిష్కరించుకొనే అవకాశం ఉంది.

పీయూ పరిధిలోని డిగ్రీ కళాశాలలు

ప్రభుత్వ కళాశాలలు	20
ఎంవీఎస్ అటానమస్	1
టీఎస్‌డబ్ల్యూఆర్‌డీసీ	3
టీటీడబ్ల్యూఆర్‌డీసీ	3
ఎంజేపీటీబీసీడీసీ	1
ప్రైవేట్ కళాశాలలు	60
మొత్తం	88

కోర్సుల వారీగా సీట్లు

బీఏ	బీకాం	బీబీఏ	బీఎస్సీ	బీఎస్‌డబ్ల్యూ	మొత్తం
8,830	6,580	360	13,910	60	29,740

ఓటీపీ చెప్పొద్దు..



దరఖాస్తుదారులు ఓటీపీ నంబర్‌ను ఎవరికి ఇవ్వకూడదు. ఆసక్తి ఉన్న కళాశాలను ఆప్షన్‌గా ఎంచుకోవాలి. మంగళవారం నుంచి యాప్, వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకునేందుకు విద్యార్థులకు అవకాశం ఉంది. విద్యార్థులు సూచించిన తేదీల్లో ఎలాంటి తప్పులు లేకుండా రిజిస్ట్రేషన్ చేసుకొని అనంతరం వెబ్ ఆప్షన్లు ఇవ్వాలి.

– చంద్రకిరణ్, అకాడమిక్ అడిట్‌సెల్, పాలమూరు యూనివర్సిటీ

మొదటిదశ సీట్ల కేటాయింపు ఇలా..

రిజిస్ట్రేషన్:	వెబ్‌ఆప్షన్లు:
ఈ నెల 16 నుంచి జూన్ 10 వరకు	ఈ నెల 20 నుంచి జూన్ 11 వరకు
సీట్ల కేటాయింపు: జూన్ 16న	సెల్ఫ్ రిపోర్టింగ్: జూన్ 16 నుంచి జూన్ 25 వరకు

'హరితహారం' లక్ష్యాన్ని చేరుకోవాలి


నారాయణపేట స్థాయీసంఘ సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ వనజమ్మ

- నర్సరీల్లో మట్టిని సరిచేసి ఎరువులు వాడాలి
- ఉపాధి కూలీలకు సౌకర్యాలు కల్పించండి
- పీహెచ్‌సీల్లో ఓపీ పెంచాలి

నారాయణపేట: తెలంగాణకు హరితహారం కార్యక్రమంలో భాగంగా 2023–24 సంవత్సరానికి 28లక్షల మొక్కలు నాటేందుకు తయారుచేసిన ప్రణాళికను విజయవంతం చేయాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ వనజమ్మ అధికారులకు సూచించారు. సోమవారం జిల్లా పరిషత్ కార్యాలయంలో రెండవ స్టాండింగ్ కమిటీ (గ్రామీణ అభివృద్ధి), నాలుగో స్టాండింగ్ కమిటీ (విద్య, వైద్య సేవలు) సమావేశాలకు చైర్‌పర్సన్ అధ్యక్షత నిర్వహించి మాట్లాడారు. ధన్వాడ మండలంలోని కొన్ని నర్సరీలలో మొక్కల బ్యాగ్‌లోనే ఎరువు, మట్టి సరిగా లేని కారణంతో చనిపోతున్నాయని, మట్టిని సరిచేసి ఎరువులు వాడాలని డీఆర్‌డీఏ పీడీని చైర్‌పర్సన్ ఆదేశించారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో జరుగుతున్న పనుల దగ్గర టెంట్లు, తాగునీరు, ప్రాథమిక చికిత్స కిట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు. బృహత్ పల్లె ప్రకృతి వనాలు 55లో ఇంకా మిగిలిన 10 ఉన్నాయని వాటిని 15 రోజుల్లో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. తెలంగాణ క్రీడా ప్రాంగణాలు 336లో పూర్తికాని వాటిని ఈ నెలాఖారులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. మిషన్ భగీరథ ఇంట్రాలో భాగంగా ఇంకా మిగిలిపోయిన ట్యాంకులను జూన్ నెలాఖరు వరకు పూర్తి చేయాలన్నారు. అదేవిధంగా మధ్యాహ్నం జరిగిన నాలుగో స్థాయీ సంఘం సమావేశం (విద్య, వైద్య సేవలు) లో ఆమె మాట్లాడారు. మన ఊరు– మన బడి కార్యక్రమంలో భాగంగా మొదటి విడత 174 పాఠశాలల్లో ఇంకా పూర్తి కాని 127 పాఠశాలలను మే నెలాఖరులోగా పూర్తి చేయాలని విద్యాశాఖ అధికారిని ఆదేశించారు. ఈ ఏడాది పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ఉత్తీర్ణత శాతం 74 వచ్చిందని విద్యాశాఖ వారు తెలుపడంతో వచ్చే విద్యా సంవత్సరంలో 10వ తరగతి ఉత్తీర్ణత శాతం వందకు పెంచాలని చైర్‌పర్సన్ ఆదేశించారు. ఆరోగ్యశాఖ విషయంలో కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా కంటి అద్దాలు అవసరమైన వారందరికీ గడువు లోపల అందించాలని వైద్యశాఖ అధికారిని ఆదేశించారు. వడదెబ్బ తగిలిన వారికి చికిత్స కోసం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సరైన సదుపాయాలు కల్పించాలని ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఓపిని పెంచాలని సూచించారు. పల్లె దవాఖానాలలో మౌలిక వసతులు కల్పించాలని తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఆపరేషన్ థియేటర్స్ శుభ్రంగా ఉంచాలని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్స్‌కు వచ్చే రోగులకు సరైన చికిత్స అందించాలని ఆదేశించారు. అలాగే మూడవ స్థాయీసంఘ సమావేశం జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ సురేఖ అధ్యక్షతన నిర్వహించారు. ఆయా సమావేశాల్లో ఆలయ కమిటీ సభ్యులు కోఆప్షన్ సభ్యులు తాజుద్దీన్, మాగనూర్ జెడ్పీటీసీ వెంకటయ్య జెడ్పీ సీఈఓ జ్యోతి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు. 5వ స్థాయీసంఘ సమావేశం (స్త్రీ, శిశు సంక్షేమం) మంగళవారానికి వాయిదా పడిందని సీఈఓ జ్యోతి పేర్కొన్నారు.

పిల్లలతోసహా తల్లి అదృశ్యం






మక్తల్: పిల్లలతో సహా తల్లి అదృశ్యమైన సంఘటన మండలంలోని జక్లేర్ చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన పూజారి రాణి అలియాస్ నామాల లక్ష్మి, రమేష్‌కు అమృత, శివాని, సుశాంత్ ఉన్నారు. ఈ నెల 13న ఇంటి నుంచి అర్ధరాత్రి పిల్లలతో సహా వెళ్లిపోయింది. భర్త రమేష్ నాగార్జునసాగర్‌లో గొర్రెల కాపరిగా ఉంటున్నాడు. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో రమేష్ తండ్రి నామాల కుంటి కుర్మన్న తన కోడలు, వారి పిల్లలు కనిపించడం లేదని సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పర్వతాలు తెలిపారు.

ఇద్దరు డీజిల్ దొంగల రిమాండ్

ఎర్రవల్లిచౌరస్తా: జాతీయ రహదారిపై డీజిల్ దొంగతనాలకు పాల్పడిన ఇద్దరిని సోమవారం అదుపులోకి తీసుకున్నట్లు కోదండాపురం ఎస్ఐ వెంకటస్వామి తెలిపారు. నారాయణపేట జిల్లా మరికల్ మండలంలోని గాజులయ్యతండాకు చెందిన రవినాయక్, పాప్య నాయక్ మరో వ్యక్తితో కలిసి జాతీయ రహదారిపై రాత్రి వేళల్లో డీజిల్ దొంగతనాలకు పాల్పడుతుండగా పోలీసులు గుర్తించి పట్టుకునేందుకు ప్రయత్నించగా, కారును వదిలేసి పరారైనట్లు తెలిపారు. పరారైన రవినాయక్, పాప్యనాయక్‌ను సోమవారం అదుపులోకి తీసుకుని అలంపూర్ కోర్టులో హాజరుపర్చి జడ్జి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

నేడు వృద్ధాశ్రమంలో న్యాయ అవగాహన సదస్సు

బిజినేపల్లి: మండల కేంద్రంలోని ప్రశాంతి వృద్ధాశ్రమంలో మంగళవారం ఉదయం న్యాయ అవగాహన సదస్సు నిర్వహించనున్నారు. జిల్లా ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి సబిత హాజరై వృద్ధులకు హక్కుల, చట్టాలపై అవగాహన కల్పించనున్నట్లు జిల్లా కోర్టు అధికారులు ప్రకటనలో తెలిపారు.

అలంపూర్ పర్యాటకంపై ప్రత్యేక దృష్టి

- సెంట్రల్ మినిస్ట్రీయల్ ఆఫ్ టూరిజం జాయింట్ సెక్రటరీ ఎంఆర్ సిన్రెమ్
- 6 నెలల్లో ప్రసాద్ స్కీం పనులు పూర్తి కావాలని ఆదేశం


హరితహోటల్ వద్ద మొక్కలు నాటుతున్న జాయింట్ సెక్రటరీ సిన్రెమ్


పనుల పురోగతి వివరిస్తున్న ఎండీ మనోహర్

జోగుళాంబ శక్తిపీఠం: అలంపూర్‌లో పర్యాటకంపై ప్రత్యేక దృష్టి సారించామని సెంట్రల్ మినిస్ట్రీయల్ ఆఫ్ టూరిజం జాయింట్ సెక్రటరీ ఎంఆర్ సిన్రెమ్ అన్నారు. సోమవారం ఆయనతో పాటు మినిస్టర్ ఆఫ్ టూరిజం డిప్యూటీ డైరెక్టర్ జనరల్ శ్రీవాస్తవ, ప్రాజెక్టు మానెటరింగ్ యూనిట్ అధికారి జావీద్‌చౌదరి, శంకర్ రెడ్డి, తెలంగాణ టూరిజం ఎండీ మనోహర్, ప్రాజెక్టు మేనేజర్ వైఆర్‌కే రాజు, డీఈ ధన్‌రాజ్, ఏఈ అనురాగ్‌రెడ్డి, ఆర్కిటెక్చర్ బాలకృష్ణ థాటి, కేపీసీ ప్రాజెక్టు సైట్ ఇంజినీర్ దాసరి రామకృష్ణ పట్టణాన్ని సందర్శించారు. యోగ నారసింహ స్వామి ఆలయం వద్ద మూడు అంతస్తుల భవన సముదాయ పనులను, మినీ బస్టాండ్, ఆలయం దాక వెళ్లే అప్రోచ్ రోడ్డు పనులను పరిశీలించారు. పనుల నాణ్యతపై సంతృప్తి వ్యక్తం చేశారు. పనులు చాలా నిదానంగా చేస్తున్నారని, నాణ్యతలో రాజీ లేకుండా వేగం పెంచాలని సూచించారు ఎట్టి పరిస్థితిలో అక్టోబర్ లోపు పనులు పూర్తి చేయాలన్నారు. డీఈ ధన్‌రాజ్ మాట్లాడుతూ స్థానికంగా ఎదురవుతున్న సమస్యలను మినిస్టర్ ఆఫ్ టూరిజం జాయింట్ సెక్రటరీ దృష్టికి తీసుకొచ్చారు. ఆలయ ఈఓ పురేందర్ బృందానికి ఆలయంలోకి ఘన స్వాగతం పలికి ప్రత్యేక పూజలు చేయించారు. ఆలయ అభివృద్ధికి కేంద్ర పర్యాటక శాఖ నుంచి కావాల్సిన సౌకర్యాలపై వారికి దృష్టికి తెచ్చారు. అనంతరం స్థానిక హరిత హోటల్‌లో వారు హరితహారం కింద మొక్కలు నాటారు. సెంట్రల్ మినిస్టర్ ఆఫ్ టూరిజం జాయింట్ సెక్రటరీ మాట్లాడుతూ.. ప్రస్తుతం చేపడుతున్న పనులకు రూ.13 కోట్ల 76లక్షలు విడుదల చేశామని, ఈ పనులు ఎంత వరకు పూర్తి చేశారో తెలుసుకుని మిగితా బడ్జెట్ విడుదల చేసేందుకు పరిశీలించినట్లు తెలిపారు. మంగళవారం శ్రీశైలం వెళ్తామని, అక్కడ కూడా ప్రసాద్ స్కీం పనులు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

మిల్లర్ల మోసంపై రోడ్డెక్కిన రైతులు


మహమ్మదాబాద్ రోడ్డుపై ధర్నా చేస్తున్న రైతులు

- హైవేపై గంటపాటు నిలిచిన వాహనాలు
- రైస్‌మిల్‌ను తనిఖీ చేసిన డీఎం, డీఎస్‌ఓ

మహమ్మదాబాద్: వరిధాన్యం కొనుగోలులో రైతులను మిల్లర్లు మోసం చేస్తున్నారంటూ రైతులు సోమవారం మహమ్మదాబాద్ హైవేపై ముళ్లకంచె వేసి రాస్తారోకో చేపట్టారు. పలువురు రైతులు మాట్లాడుతూ.. క్వింటాలుకు 8కిలోల అదనపు తూకం తీస్తున్నారని తెలిపారు. 40 కేజీల బస్తాకు 700 గ్రాముల తీసుకోవాల్సి ఉండగా, 41కేజీ 300 గ్రాముల ధాన్యం తూకం వేస్తున్నారని చెప్పారు. ఇలాంటి ధాన్యాన్ని మిల్లర్ల దగ్గరకు తీసుకెళితే.. వారు 40కేజీల బస్తాకు కిలో నుంచి 2కిలోల వరకు తరుగు తీస్తున్నారు. దీంతో క్వింటాల్‌కు మొత్తం మీద 8కిలోల నుంచి 10కిలోల వరకు కటింగ్ తీస్తున్నారని ఆరోపించారు. గంటపాటు ధర్నా చే యడంతో రోడ్డుకు ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. చివరకు ఎస్ఐ, తహసీల్దార్ కల్పించుకుని ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో రైతులు శాంతించారు.

రైస్ మిల్లును తనిఖీ చేసిన అధికారులు

రాస్తారోకో అనంతరం రైతులంతా కలిసి సాయి సంతోషి రైస్‌మిల్లర్ వద్దకు వెళ్లి తరుగు ఎందుకు తీస్తున్నారని నిలదీశారు. మిల్లర్ యాజమాన్యంకు రైతులకు వాగ్వాదం చోటు చేసుకుంది. అనంతరం అక్కడికి వచ్చిన జిల్లా సివిల్ సప్లయి అధికారి డీఎం ప్రవీణ్‌కుమార్, డీఎస్ఓ బాల్‌రాజ్‌లు యజమాని అశోక్‌తో మాట్లాడారు. నాణ్యమైన ధాన్యం తీసుకువస్తే తరుగు తీయనని తెలపడంతో లారీల్లో వచ్చిన ధాన్యాన్ని పరిశీలించారు. రైతుల తరఫున వచ్చిన జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి మిల్లర్లపై పడే భారాన్ని రైతులపై ఎలా వేస్తారని ప్రభుత్వ నిబంధనల మేరకు రైతులు నష్టపోకుండా చూడాలని తెలిపారు. దానికి మిల్లర్ ససేమిరా అనడంతో.. నిబంధనల మేరకు కొనుగోలు చేయకుంటే మిల్లును మూసుకోవాలని జిల్లాలో ఎక్కడైనా అమ్ముకుంటామని తీవ్ర ఆగ్రహం వ్యక్తపరిచారు. ఒక్క కిలో కూడా తరుగు తీయకుండా కొనుగోలు చేయాలని లేదంటే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసి మిల్లు సీజ్ చేయిస్తామని మండిపడ్డారు. ఎంపీపీ మాధవి, మహమ్మదాబాద్ తహసీల్దార్ ఆంజనేయులు, హన్వాడ తహసీల్దార్ బక్కని శ్రీనివాస్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ ఆదిత్య, దేవరకద్ర డీటీ బాలప్రసాద్ ఉన్నారు.


రైస్‌మిల్లులో ధాన్యం తనిఖీ చేస్తున్న అధికారులు

దోపిడీని అడ్డుకోవాలంటూ రైతుల ధర్నా


గద్వాల మండలం కొత్తపల్లి వద్ద రోడ్డుపై బైఠాయించిన రైతులు

గద్వాల రూరల్: అసలే అకాల వర్షానికి ఆరుగాలం కష్టించిన పంట నష్టం వస్తే ఇప్పుడు మిల్లర్లు నిలువునా దోపిడీ చేస్తున్నారంటూ రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం గద్వాల మండలం కొత్తపల్లిలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో 40కేజీల బస్తాకు తరుగు పేరిట మూడున్నర కేజీల చొప్పున తీస్తూ నిలువునా దోపిడీకి పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిని నిరసిస్తూ రైతులు రోడ్డుపై బైటాయించి నిరసన తెలిపారు. గతేడాది కేవలం అర కేజీ మాత్రమే తరుగు తీసేవారని ఇప్పుడు ఏకంగా మూడున్నర కేజీలు తరుగు తీయడం ఎంతవరకు సబబన్నారు. మిల్లర్లు, అధికారులు ములాఖత్ అయి రైతులకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. ఈవిధంగా తరుగు తీయడం వల్ల క్వింటాల్‌కు సుమారు రూ.200 వరకు రైతుకు నష్టం వస్తుందన్నారు. రెండు రోజుల కిందట తరుగు అధికంగా తీస్తున్నందున ధాన్యాన్ని లోడ్ చేసేందుకు వచ్చిన లారీని వెనక్కి పంపినట్లు తెలిపారు. తరువాత రెండు రోజులైనా ధాన్యం కొనుగోలు చేయకుండా లారీలను పంపకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. దీనిపై ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి ఎలాంటి తరుగు లేకుండా తమ ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండు చేశారు. లేందంటే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామన్నారు.

ఆయిల్‌పాం గెలల కత్తిరింపు


కోసిన గెలలను తూకం చేస్తున్న అధికారులు

వనపర్తి: ఆయిల్‌పాం సాగును ప్రోత్సహిస్తూ ఏటా సాగు విస్తీర్ణం పెంచుతున్నామని జిల్లా ఉద్యాన అధికారి సురేష్‌కుమార్ తెలిపారు. శ్రీరంగాపురం మండలం కంబాళాపురంలో ఆనంద్‌రెడ్డి మూడేళ్ల కిందట సాగుచేసిన ఆయిల్‌పాం తోటలో గెలలు కోతకు రావటంతో జిల్లాలో మొదట కత్తిరింపు ప్రక్రియ సోమవారం ప్రారంభించినట్లు ఆయన తెలిపారు. తొలి కాతగా ఒక చెట్టు నుంచి 7 కిలోల తాజా పండ్ల గుత్తులు కత్తిరించినట్లు వివరించారు. టన్ను రూ.14,200 చొప్పున ప్రీ యూనిక్ ఆయిల్‌పాం కంపెనీకి విక్రయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆయిల్‌పాం కంపెనీ డిప్యూటీ జనరల్ మేనేజర్ రాంమోహన్‌రావు, ఉద్యాన అధికారి కృష్ణయ్య, రైతులు పాల్గొన్నారు.

వలస కూలీ దారుణ హత్య


మృతిచెందిన సతీష్

దామరగిద్ద: మండలంలో వత్తుగుండ్లకు చెందిన వలస కూలీ మోహినాబాద్‌లో దారుణ హత్యకు గురైన సంఘటన ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్ఐ లక్ష్మారెడ్డి వివరాల ప్రకారం వత్తుగుండ్ల గ్రామానికి చెందిన సతీష్(35) కొంత కాలంగా మోహినాబాద్‌లో పనిచేస్తున్నాడు. మూడు రోజుల కిందట వివిధ పనుల నిమత్తి గ్రామానికి చేరుకున్నాడు. పని ముగించుకొని మొహినాబాద్‌కు వెళ్లేందుకు వెళ్లేందుకు సిద్ధమయ్యాడు. గుర్తుతెలియని వ్యక్తులు గ్రామ శివారులో సతీష్‌ను హత్య చేశారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దరాప్తు చేస్తునట్లు ఎస్ఐ పేర్కొన్నాడు.

వేర్వేరు ప్రమాదాల్లో ఏడుగురికి గాయాలు

భూత్పూర్: మండలంలోని అన్నాసాగర్, మున్సిపాలిటీలోని అమిస్తాపూర్ సమీపంలో గల సారికా టౌన్‌షిప్ వద్ద సోమవారం సాయంత్రం రెండు వేర్వేరు ప్రమాదాల్లో ఏడుగురికి గాయాలయ్యాయని ఎస్ఐ భాస్కర్‌రెడ్డి తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని అన్నాసాగర్ సమీపంలోని జాతీయ రహదారిపై ఆటో భూత్పూర్ నుంచి ముసాపేటకు వెళ్తుండగా, వెనుక నుంచి హైదరాబాద్ నుంచి కొత్తకోట వెళ్తున్న కారు ఢీకొంది. ఆటో బోల్తాపడగా ముసాపేట మండలం సంకలమద్దికి ఆటో డ్రైవర్ రాములు, భాస్కర్, స్ఫూర్తితండాకు చెందిన దేవమ్మ, సరస్వతి, గౌతమి, శ్రావణ్‌కు గాయాలు కాగా చికిత్స నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు. మరో ఘటనలో అమిస్తాపూర్ సమీపంలోని సారికా టౌన్‌షిప్ నుంచి భూత్పూర్ వైపు మలుతున్న కారును మహబూబ్‌నగర్ నుంచి భూత్పూర్ వైపు వస్తున్న స్కూటీ ఢీకొంది. స్కూటీపై ఉన్న శివకు గాయాలుకాగా జిల్లా జనరల్ ఆస్పత్రికి తరలించారు. శివ వనపర్తి జిల్లా ఖిల్లాఘనపురం మండలం కమాలోద్దీన్‌పూర్‌కు చెందిన వాడు. ప్రమాదానికి గల కారణాలపై నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మలుపు తిప్పిన ముఠా!

చంద్రబాబు బృందం చెప్పినట్టుగానే ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్

సాక్షి, అమరావతి: అమరావతి ముసుగులో నారా చంద్రబాబునాయుడు సాగించిన భూదందాలో ఇన్నర్‌రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ అంశం ఓ అవినీతి అధ్యాయమేనని వెల్లడైంది. అలైన్‌మెంట్ ప్రతి మెలికలోనూ పచ్చ గ్యాంగ్ అవినీతి గుట్టు రట్టవుతోంది. టీడీపీ హయాంలో సీఆర్‌డీఏ చైర్మన్‌గా ఉన్న చంద్రబాబు, వైస్ చైర్మన్ పొంగూరు నారాయణ అవినీతి బాగోతాలు విస్తుపోయే రీతిలో ఉన్నాయి. చంద్రబాబు సన్నిహితుడైన లింగమనేని రమేష్ భూముల మార్కెట్ విలువ రూ.177.50 కోట్ల నుంచి వెంటనే రూ.877.50 కోట్లకు... రాజధాని నిర్మాణం అనంతరం ఏకంగా రూ.2,130 కోట్లకు చేరేలా ఇన్నర్‌రింగ్ రోడ్ అలైన్‌మెంట్‌ను ఖరారు చేయడం ఎల్లో గ్యాంగ్ బరి తెగింపు వ్యవహారాలకు నిదర్శనంగా నిలుస్తోంది. ఈ అవినీతి పాపంలో చంద్రబాబు తన దత్తపుత్రుడు పవన్ కల్యాణ్‌కు కూడా పిడికెడు వాటా ఇవ్వడం కొసమెరుపు. అవినీతికి బాటలు వేసిన ఇన్నర్‌రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ వెనుక సాగిన గూడుపుఠాణీ దశలవారీగా ఇదిగో ఇలా సాగింది..!

■ అలైన్‌మెంట్‌ను ఆనుకుని భూములు

ఇన్నర్‌రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌ను మెలికలు తిప్పడం ద్వారా హెరిటేజ్ ఫుడ్స్, లింగమనేని రమేశ్ కుటుంబానికి చెందిన భూముల విలువ భారీగా పెరిగింది. కంతేరు, కాజాలో లింగమనేని కుటుంబానికి 355 ఎకరాలున్నాయి. మొదట రూపొందించిన అలైన్‌మెంట్ ప్రకారం ఆ భూములకు 3 కి.మీ. దూరంగా ఇన్నర్‌రింగ్ రోడ్డు నిర్మించాలి. అలైన్‌మెంట్ మార్పుతో ఆ భూములను ఆనుకుని ఉండేలా ఇన్నర్‌రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ ఖరారు చేశారు. ఆ ఇన్నర్‌రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌ను ఆనుకునే హెరిటేజ్ ఫుడ్స్‌కు చెందిన 9 ఎకరాలు ఒకచోట, ఒప్పందం చేసుకున్న నాలుగు ఎకరాలు మరో చోట ఉండటం గమనార్హం.

■ అమాంతం పెరిగిన విలువ

ఇన్నర్‌రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ ఖరారుకు ముందు లింగమనేని కుటుంబం ఆ ప్రాంతంలో ఎకరా భూమి రూ.8 లక్షల రిజిస్టర్ విలువ చొప్పున విక్రయించింది. మార్కెట్ ధర ప్రకారం ఎకరా రూ.50 లక్షలు ఉంది. అంటే ఆ భూముల మార్కెట్ విలువ రూ.177.50 కోట్లు. ఇక ఇన్నర్‌రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ ఖరారు తరువాత ఎకరం రూ.36 లక్షల రిజిస్టర్ విలువ చొప్పున విక్రయించింది. అంటే రిజిస్టర్ విలువే నాలుగున్నర రెట్లకుపైగా పెరిగింది. మార్కెట్ ధర ప్రకారం ఎకరా రూ.2.50 కోట్లు పలికింది. అంటే 355 ఎకరాల విలువ మార్కెట్ ధర ప్రకారం అమాంతంగా రూ.887.50 కోట్లకు పెరిగింది. అమరావతి నిర్మాణం పూర్తయితే సీడ్ క్యాపిటల్ ప్రాంతంలో ఎకరా విలువ రూ.4 కోట్లకు చేరుతుందని నాడు ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబే ప్రకటించారు. ఇన్నర్ రింగ్ రోడ్డును ఆనుకుని ఉన్న భూముల విలువ ఎకరా రూ.6 కోట్లకు చేరుతుందని అంచనా వేశారు. అంటే అమరావతి నిర్మాణం పూర్తయితే ఆ 355 ఎకరాల విలువ ఏకంగా రూ.2,130 కోట్లకు చేరుతుందని అంచనా. ఆ ప్రకారం మార్కెట్ ధరను బట్టి హెరిటేజ్ ఫుడ్స్ 9 ఎకరాల విలువ రూ.4.50 కోట్ల నుంచి రూ.22.50 కోట్లకు పెరిగింది. అమరావతి నిర్మాణం పూర్తయితే రూ.54 కోట్లకు చేరుతుందని తేలింది. హెరిటేజ్ ఫుడ్స్ ఒప్పందం చేసుకున్న మరో నాలుగు ఎకరాల విలువ కూడా రూ.24 కోట్లకు చేరుతుంది.

■ అక్కడే పవన్ కల్యాణ్‌కు 2.40 ఎకరాలు

జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కు కూడా ఈ ఇన్నర్‌రింగ్ రోడ్డు అవినీతి పాపంలో చంద్రబాబు పిడికెడు వాటా ఇచ్చారు. కాజాకు సమీపంలో ఇన్నర్‌రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌కు సమీపంలోనే పవన్‌కల్యాణ్‌కు 2.4 ఎకరాలున్నాయి. లింగమనేని కుటుంబం నుంచి ఆ భూములను ప్రభుత్వ ధర ప్రకారం ఎకరా రూ.8 లక్షలు చొప్పున కొనుగోలు చేసినట్లు చూపించారు. ల్యాండ్ పూలింగ్ నుంచి మినహాయింపు కల్పించిన భూమినే పవన్ కల్యాణ్‌కు ఇవ్వడం గమనార్హం.

■ కృష్ణా ఇవతలా అవినీతి మెలికలే

అమరావతి పరిధిలో ఇన్నర్‌రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ ద్వారా చంద్రబాబు, లింగమనేని కుటుంబాల భూముల విలువ అమాంతం పెంచుకోగా కృష్ణానదికి ఇవతల విజయవాడ శివారులో నారాయణ తమ ఆస్తుల విలువ భారీగా పెంచుకున్నారు. సీఆర్‌డీఏ అధికారులు మొదట రూపొందించిన అలైన్‌మెంట్ ప్రకారం ఇన్నర్‌రింగ్ రోడ్డును గుంటూరు జిల్లాలోని అమరావతి నుంచి కృష్ణా జిల్లాలోని నున్న మీదుగా నిర్మించాల్సి ఉంది. అందుకోసం కృష్ణా నదిపై వంతెన నిర్మిస్తారు. గుంటూరు జిల్లాలోని నూతక్కి - కృష్ణా జిల్లా పెద్దపులిపర్రు మధ్య కృష్ణా నదిపై వంతెన నిర్మించి అక్కడ నుంచి తాడిగడప నుంచి ఎనికేపాడు మీదుగా నున్న వరకు ఇన్నర్‌రింగ్ రోడ్డు కొనసాగుతుంది. అయితే అలా నిర్మిస్తే నారాయణ విద్యా సంస్థల భవనాలను భూసేకరణ కింద తొలగించాల్సి వస్తుంది. ఈ అలైన్‌మెంట్‌పై నారాయణ నాడు సీఆర్‌డీఏ అధికారులపై తీవ్రస్థాయిలో ఆగ్రహావేశాలు వ్యక్తం చేశారు. సీఆర్‌డీఏ సమావేశంలో అధికారులను పరుష పదజాలంతో దూషిస్తూ అలైన్‌మెంట్‌ను మార్చాలని ఆదేశించారు. దాంతో ఇన్నర్‌రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌ను 3 కి.మీ. తూర్పు దిశగా మార్చారు. ఆ ప్రకారం గుంటూరు జిల్లాలో రామచంద్రాపురం - కృష్ణా జిల్లా చోడవరం మధ్య వంతెన నిర్మించాలని ప్రతిపాదించారు. అక్కడ నుంచి పెనమలూరు మీదుగా నిడమానూరు నుంచి నున్న వరకు ఇన్నర్‌రింగ్ రోడ్డును నిర్మిస్తారు. నారాయణ కుటుంబానికి చెందిన 9 విద్యా సంస్థల భవనాలను ఆనుకుని ఉండేలా ఇన్నర్‌రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌ను ఖరారు చేశారు. తన విద్యా సంస్థల భూముల విలువ అమాంతం పెరిగేలా నారాయణ చక్రం తిప్పారు.

■ అటూ ఇటూ భారీగా కొనుగోలు

ఇన్నర్‌రింగ్ రోడ్డును ఎలా నిర్మించనున్నారో ముందుగానే తెలిసిన బాబు, నారాయణ తమ కుటుంబ సంస్థలు హెరిటేజ్, రామకృష్ణ హౌసింగ్ లిమిటెడ్‌లతోపాటు తమ బినామీ లింగమనేని రమేష్ తన సంస్థల పేరిట భారీగా భూములు కొన్నారు. అవన్నీ ప్రతిపాదిత ఇన్నర్‌రింగ్ రోడ్డుకు అటూ ఇటూ ఉండటం గమనార్హం. సీఐడీ అధికారులు మంగళగిరి, పెదకాకాని, తాడికొండ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో భూముల రిజిస్ట్రేషన్లను పరిశీలించగా ఈ విషయం స్పష్టమైంది.



అమరావతి ఇన్నర్‌రింగ్‌రోడ్డు అలైన్‌మెంట్‌లో మార్పులు
వయొలెట్ కలర్: సీఆర్‌డీఏ అధికారులు మొదట రూపొందించిన అలైన్‌మెంట్
బ్లాక్ కలర్ : చంద్రబాబు ఆదేశాలతో మారిన అలైన్‌మెంట్. హెరిటేజ్ ఫుడ్స్, లింగమనేని భూములను ఆనుకొని రూపొందించిన అలైన్‌మెంట్
రెడ్ కలర్ : ఎస్టీయూపీ కన్సల్టెన్సీ ఖరారు చేసిన అలైన్‌మెంట్. హెరిటేజ్ ఫుడ్స్, లింగమనేని భూములను ఆనుకొని ఖరారు చేసిన అలైన్‌మెంట్.(మార్కింగ్ చేసిన భూములే హెరిటేజ్ ఫుడ్స్, లింగమనేని కుటుంబాలకు చెందినవి)

అలైన్‌మెంట్ 1

సీఆర్‌డీఏ తొలుత రూపొందించింది

అమరావతి ఇన్నర్‌రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ నిర్ణయించేందుకు టెండర్ల ద్వారా కన్సల్టెన్సీతో నిమిత్తం లేకుండా పని ముగించాలని చంద్రబాబు, నారాయణ నిర్ణయించారు. దీంతో సీఆర్‌డీఏ అధికారులు 94 కి.మీ. పొడవుతో అమరావతి ఇన్నర్‌రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌ను రూపొందించారు. దీన్ని చూసి చంద్రబాబు, నారాయణ మండిపడ్డారు. ఎందుకంటే దాని ప్రకారం ఇన్నర్‌రింగ్ రోడ్డు పెదపరిమి, నిడమర్రు, చినవడ్లపూడి, పెదవడ్లపూడి మీదుగా వెళ్తుంది. చంద్రబాబు కుటుంబానికి చెందిన హెరిటేజ్ ఫుడ్స్, లింగమనేని కుటుంబానికి చెందిన భూములకు 3 కి.మీ. దూరం నుంచి ఇన్నర్‌రింగ్ రోడ్డు నిర్మించాల్సి వస్తుంది. దీంతో తమ భూముల విలువ అమాంతం పెంచుకునేందుకు ఆ అలైన్‌మెంట్‌ను మార్చాలని ఆదేశించారు.



రెడ్ కలర్ : గుంటూరు, కృష్ణాజిల్లాలను కలుపుతూ కృష్ణానది మీదుగా సీఆర్‌డీఏ అధికారులు ఖరారు చేసిన ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్
గ్రీన్ కలర్ : నారాయణ ఆదేశాలతో కృష్ణా, గుంటూరు జిల్లాలను అనుసంధానిస్తూ ఇన్నర్‌రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌లో చేసిన మార్పులు

అలైన్‌మెంట్ 2


చంద్రబాబు ఆదేశాలతో రూపొందించారు

గత సర్కారు పెద్దల ఆదేశాలతో సీఆర్‌డీఏ అధికారులు ఇన్నర్‌రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌లో కీలక మార్పులు చేశారు. చంద్రబాబు, లింగమనేని కుటుంబానికి చెందిన వందలాది ఎకరాలున్న తాడికొండ, కంతేరు, కాజా ప్రాంతాలను పరిగణలోకి తీసుకుంటూ ఇన్నర్‌రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌ను 3 కి.మీ. దక్షిణానికి జరిపారు. హెరిటేజ్ ఫుడ్స్, లింగమనేని కుటుంబానికి కంతేరు, కాజాలో ఉన్న భూములను ఆనుకుని మరీ ఇన్నర్‌రింగ్ రోడ్డు నిర్మించేలా 97.50 కి.మీ. మేర అలైన్‌మెంట్‌ను రూపొందించారు. ఆ విషయాన్ని గోప్యంగా ఉంచారు.

అలైన్‌మెంట్ 3

కన్సల్టెన్సీ ద్వారా ఆమోదించింది

సింగపూర్‌కు చెందిన సుర్బానా జ్యురాంగ్ కన్సల్టెన్సీ ద్వారా రూపొందించిన అమరావతి మాస్టర్‌ప్లాన్‌లోనే ప్రతిపాదిత ఇన్నర్‌రింగ్ రోడ్ డిజైన్‌ను చంద్రబాబు ప్రభుత్వం ముందుగానే చేర్చింది. అంటే అప్పటికే ఇన్నర్‌రింగ్ రోడ్ అలైన్‌మెంట్ ఎలా ఉండాలన్నది నిర్ధారణ అయిపోయింది. అనంతరం ఇన్నర్‌రింగ్ రోడ్ అలైన్‌మెంట్‌ను రూపొందించేందుకు ఎస్టీయూపీ అనే ఓ కన్సల్టెన్సీని నియమించారు. మాస్టర్‌ప్లాన్‌లో పొందుపరిచిన అలైన్‌మెంట్‌కు అనుగుణంగానే అది ఉండాలని నిర్దేశించారు. అప్పటికే సీఆర్‌డీఏ ద్వారా తాము ఖరారు చేసిన అలైన్‌మెంట్‌నే ఎస్టీయూపీ కన్సల్టెన్సీ ద్వారా తెరపైకి తెచ్చి ఆమోదించారు. తాడికొండ, కంతేరు, కాజాలో హెరిటేజ్ ఫుడ్స్, లింగమనేని భూములను ఆనుకునే అలైన్‌మెంట్‌ను ఎస్టీయూపీ కన్సల్టెన్సీ ఖరారు చేసింది.



అమరావతి ఇన్నర్ రింగ్‌రోడ్డు అలైన్‌మెంట్‌లో మార్పులు

వయొలెట్ కలర్ : సీఆర్‌డీఏ అధికారులు మొదట రూపొందించిన అలైన్‌మెంట్
బ్లాక్ కలర్ : చంద్రబాబు ఆదేశాలతో మారిన అలైన్‌మెంట్. హెరిటేజ్ ఫుడ్స్, లింగమనేని భూములను ఆనుకొని రూపొందించిన అలైన్‌మెంట్
రెడ్ కలర్ : ఎస్టీయూపీ కన్సల్టెన్సీ ఖరారు చేసిన అలైన్‌మెంట్. హెరిటేజ్ ఫుడ్స్, లింగమనేని భూములను ఆనుకొని ఖరారు చేసిన అలైన్‌మెంట్. (మార్కింగ్ చేసిన భూములే హెరిటేజ్ ఫుడ్స్, లింగమనేని కుటుంబాలకు చెందినవి)

డీటీసీలో శిక్షణకు ఏర్పాట్లు: ఎస్పీ



డీటీసీలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎస్పీ నర్సింహ

జడ్చర్ల: పట్టణ సమీపంలోని జిల్లా పోలీసు శిక్షణ కేంద్రంలో త్వరలోనే కొత్త కానిస్టేబుళ్లకు శిక్షణ ఇచ్చేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని ఎస్పీ నర్సింహ డీటీసీ అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన డీటీసీని సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. తాగునీరు, డైనింగ్ హాల్, తరగతి గదులు, మైదానం,ఫైరింగ్ రేంజ్ ఇతర సదుపాయాలను సిద్ధం చేయాలన్నారు. శిక్షణకు హాజరయ్యే అభ్యర్థులు ఇబ్బందులు పడకుండా చూడాలన్నారు.

నిండుగా 'రామన్‌పాడు'

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో సోమవారం 1,021 అడుగుల వరకు నీరు వచ్చి చేరింది. జూరాల ఎడమ కాల్వ, సమాంతర కాల్వ నుంచి వచ్చే నీటిని నిలిపివేశారు. రామన్‌పాడు నుంచి ఎన్టీఆర్ కాల్వ నీటిని నిలిపారు. తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నారు.

ప్రశాంతంగా ముగిసిన కౌలు వేలం



వేలం నిర్వహిస్తున్న అధికారులు

పెబ్బేరు: మండలంలోని తిప్పాయిపల్లిలో గల ఆంజనేయస్వామి దేవాలయ భూమి కౌలుకు వేసిన వేలం సోమవారం పూర్తయినట్లు దేవాదాయ శాఖ అధికారులు ఆంజనేయులు, కవిత తెలిపారు. 322, 323/1 సర్వే నంబర్‌లో గల 23.5ఎకరాల భూమికి వేలం పిలవగా 11మంది పాల్గొన్నారు. రూ.1.41లక్షలకు వేలం పాడినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో దేవాదాయ కమిటీ చైర్మన్ నర్సింహారెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, ఉప సర్పంచ్ బుచ్చన్న, నర్సింహ, నారాయణగౌడ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

డెంగీ దడ

- జిల్లాలో పెరుగుతున్న కేసుల సంఖ్య
- ఐదేళ్లలో 1,730 పాజిటివ్ కేసులు నమోదు
- నేడు 8వ జాతీయ డెంగీ నివారణ దినోత్సవం

పాలమూరు: డెంగీ.. ఈ వ్యాధి పేరు వింటనే దడ పుడుతుంది. చిన్నపాటి దోమ కుట్టడం వల్ల రూ.లక్షలు ఖర్చయ్యే పరిస్థితి ప్రస్తుతం ఉంది. ప్రైవేట్ ఆస్పత్రులలో పరీక్షలతో పాటు చికిత్సకు సైతం అధికంగా డబ్బులు వసూలు చేస్తూ బాధితుల జేబుకు చిల్లు పెడుతున్నారు. పగటి పూట దోమలతో జాగ్రత్తగా ఉండాలని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఇంటి పరిసరాలు శుభ్రంగా లేకపోవడం, ఆరుబయట మురుగు, ఇతర కారణాల వల్ల దోమలు వృద్ధి చెంది డెంగీ సోకడానికి కారణం అవుతున్నాయి. మంగళవారం 8వ జాతీయ డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం..

వ్యాధి లక్షణాలు

డెంగీ సోకిన వారికి వారం రోజుల్లో లక్షణాలు కనిపిస్తాయి. జ్వరంతో పాటు కళ్లు తిరిగినట్లు అవుతుంది. దోమ కుట్టగానే దద్దుర్లు వస్తాయి. ఒళ్లంతా నొప్పులు బాగా వేధిస్తాయి. రోగికి రక్తకణాల సంఖ్య పడిపోతూ ఉంటుంది. వర్షాకాలంలో దోమల బెడద అధికంగా ఉంటుంది. ప్రధానంగా అపరిశుభ్ర పరిసరాలు, ఓపెన్ నాలాలు, మురుగు నిల్వ ఉన్న చోట దోమలు పెరగడానికి అవకాశం ఎక్కువ. ప్లాస్మోడియం, వైవాక్స్ ప్లాస్మోడియం ఫాల్సీపారమ్ అనేవి రెండు రకాలు. ఇందులో రెండో రకం చాలా ప్రమాదకరం. డెంగీ లక్షణాలు కనిపించిన వెంటనే రక్త పరీక్షలు చేసి వ్యాధిని నిర్ధారించి త్వరగా చికిత్స అందించాలి. లేదంటే కాలేయాన్ని, మూత్ర పిండాలను రక్త కణాలను దెబ్బతీస్తుంది. ఒక్కోసారి మెదడుపై దాడి చేసి రోగి కోమాలోకి వెళ్లే ప్రమాదం ఉంది.

ఈడిస్ ఈజిప్టై దోమ కారణంగా డెంగీ సోకుతుంది. నల్లగా ఉండే ఈ దోమ ఒంటిపై తెల్లని చారలు ఉంటాయి. దీన్ని టైగర్ దోమగా వ్యవహరిస్తారు. ఇది కుట్టిన 7–8 రోజుల తర్వాత లక్షణాలు కన్పిస్తాయి. హఠాత్తుగా తీవ్రమైన జ్వరం రావటం, కళ్లు కదలించలేని పరిస్థితి ఏర్పడుతుంది. భరించలేని కండరాల నొప్పి, వాంతులు, వికారం రక్తంతో కూడిన



మహబూబ్‌నగర్‌లో అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు

ఏడాది	పరీక్షలు	డెంగీ పాజిటివ్ కేసులు
2019	4,090	886
2020	796	113
2021	3,633	453
2022	4,208	255
2023	2,092	23

మల విసర్జన, కడుపు నొప్పి ఉంటాయి. రక్తపోటుతోపాటు రక్త కణాల సంఖ్య తగ్గిపోతుంది. అన్ని అవయవాలు వైఫల్యం చెంది ప్రాణాపాయం సంభవించే అవకాశం ఉంటుంది. లక్షణాల ద్వారా ముందే గుర్తిస్తే పూర్తిస్థాయిలో చికిత్స అందించవచ్చు. వాతావరణ మార్పులతో ఒక్కసారిగా సీజన్ వ్యాధులు ప్రబలే అవకాశం అధికంగా ఉంటుంది. ఎండకాలం నుంచి వేడి పూర్తిగా తగ్గడంతో వైరల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. వానాకాలంలో నీటి కాలుష్యం ఎక్కువ. పిల్లలకు, వృద్ధులకు, గర్భినులకు కాచి వడబోసిన నీళ్లే తాగించాలి.

అవగాహన కల్పిస్తున్నాం.

గ్రామాల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టి, పరిసరాలు శుభ్రంగా ఉండేలా అవగాహన కల్పిస్తున్నాం. వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో పల్లెల్లో ప్రజలకు డెంగీ వ్యాధి ఎలా వస్తుందనే విషయాన్ని వివరిస్తున్నాం. పట్టణ ప్రాంతాల్లో కేసులు నమోదవుతున్న ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెడుతున్నాం. జిల్లాలో సీజన్ వ్యాధులను అరికట్టడానికి ప్రతి శుక్రవారం డ్రై డే నిర్వహిస్తూ, కేసులు నమోదు అవుతున్న గ్రామాల్లో సర్వే చేసి రక్త నమూనాలు సేకరించి ల్యాబ్‌కు తరలిస్తున్నాం. జనరల్ ఆస్పత్రిలో డెంగీ కిట్లు అందుబాటులో ఉన్నాయి. అవసరం అయిన వారు పరీక్ష చేసుకోవచ్చు. **– శ్వేతా, జిల్లా మలేరియా అధికారి, మహబూబ్‌నగర్**

ఆహార పదార్థాలపై ఈగలు, దోమలు వాలకుండా చూసుకోవాలి. వాంతులు, విరోచనాలు అవుతుంటే నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలి.

ఇథనాల్ ఫ్యాక్టరీలను రద్దు చేయండి



మాట్లాడుతున్న చంద్రశేఖర్

మక్తల్: మరికల్ మండలం చిత్తనూర్, కృష్ణ మండలం హిందుపూర్ గ్రామాల్లో ఈథనాల్ కెమికల్ ఫ్యాక్టరీలను వెంటనే రద్దు చేయాలని కేఎన్‌పీఎస్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని చిత్తనూర్ ఇథనాల్ కంపెనీ వ్యతిరేక పోరాట కమిటీ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. నాయకులు మాట్లాడుతూ.. రెండు గ్రామాల్లో కెమికల్ ఫ్యాక్టరీలను ఏర్పాటు చేయడంతో పట్ల రామన్‌పాడు తాగునీరు, జూరాల ప్రాజెక్టు, కృష్ణానది నుంచి మిషన్ భగీరథ తాగునీటి సరఫరా కలుషితం అయ్యే అవకాశం ఉందన్నారు. కెమికల్ పదార్థాలను భూమిలోకి వదలడంతో పంటలు సక్రమంగా పండవన్నారు. ధర్నాలో నర్సప్ప, నాగేష్, చంద్రశేఖర్, సుదర్శన్, రాజు, సరోజన, స్వరూప, కృష్ణ, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

దళితులపై దాడులు అరికట్టాలి

కోస్గి: దళితులపై దాడులను అరికట్టడంతోపాటు, ఎస్సీల రిజర్వేషన్లను కొల్లగుడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్ వైస్ చైర్మన్ అరుణ్ హాల్దర్‌కు విన్నవించారు. హైదరాబాద్‌లో జాతీయ ఎస్సీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి నాయకులు ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు. రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యంతో మతం మారిన దళితులు ఎస్సీ ధ్రువీకరణ పత్రాలు పొందుతూ రాజ్యాంగ స్ఫూర్తికి తూట్లు పొడుస్తున్నారన్నారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైన బాధితులకు తక్షణమే నష్టపరిహారం నిధులు మంజూరు చేసేలా ప్రభుత్వానికి సూచించాలని కోరారు. కార్యక్రమంలో బలరాం, దేవేంద్రప్ప, మోహన్, వెంకటేష్ పలువురు సభ్యులు ఉన్నారు.



వైస్ చైర్మన్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

మంత్రిపై జాతీయ ఎస్సీ కమిషన్ వైస్ చైర్మన్‌కు ఫిర్యాదు

పాలమూరు: బీజేపీ ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో సోమవారం హైదరాబాద్‌లో రాష్ట్ర మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌పై జాతీయ ఎస్సీ కమిషన్ వైస్ చైర్మన్ అరుణ్ హాల్దర్‌కు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఎస్సీ సామాజిక వర్గం థర్డ్‌క్లాస్ వ్యక్తులని బహిరంగసభలో మంత్రి ఎస్సీ కులాన్ని కించపరిచే విధంగా చేసిన వ్యాఖ్యలపై ఈ ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు చేసిన వారిలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బంగారు శ్రుతి, బీజేపీ ఎస్సీ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు వేముల అశోక్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు జలాల శివుడు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాంతికుమార్, పాలమూరు జిల్లా అధ్యక్షుడు కొంగలి శ్రీకాంత్ పాల్గొన్నారు.

అగ్రి లీగల్ ఎయిడ్ క్లినిక్ సేవలు బలోపేతం చేయాలి

సీనియర్ సివిల్ జడ్జి సంధ్యారాణి

పాలమూరు: సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు జిల్లాలో ఏర్పాటు చేసిన అగ్రి లీగల్ ఎయిడ్ క్లినిక్ సేవలను మరింత విస్తృతం చేయాలని జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి సంధ్యారాణి అన్నారు. జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యాలయంలో సోమవారం ప్యానెల్ న్యాయవాదులు, పారా లీగల్ వలంటీర్లతో సమీక్ష నిర్వహించారు. అగ్రి లీగల్ ఎయిడ్ క్లినిక్‌ల ద్వారా రైతులకు, ఇతరులకు న్యాయ సహాయంపై దృష్టి పెట్టాలన్నారు. దిశా చట్టం, ప్రోబోనో టెలీల యాప్ సేవలను వివరించారు. ఇప్పటికే దేవరకద్రలో అగ్రి లీగల్ ఎయిడ్‌క్లినిక్ ఏర్పాటు చేసుకోవడం జరిగిందని, త్వరలో కోయిలకొండలో కూడా ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ క్లినిక్‌ల ద్వారా వారానికి రెండు రోజుల పాటు నియమించిన పారా లీగల్ వలంటీర్లు రైతులకు న్యాయ సలహాలు, సూచనలు ఇవ్వాలన్నారు.



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి సంధ్యారాణి

అన్నివర్గాల అభ్యున్నతికి కృషి

గద్వాల: అన్నివర్గాల ప్రజల అభ్యున్నతి, సంక్షేమానికి బీజేపీ ప్రభుత్వం కృషి చేస్తుందని బీజేపీ జాతీయ ఉపాధ్యాక్షురాలు డీకే అరుణ అన్నారు. సోమవారం స్థానిక బృందావన్ గార్డెన్‌లో పాస్టర్లు ఏర్పాటు చేసిన దైవ సేవకుల ఆత్మీయ సమ్మేళనానికి డీకే అరుణ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రజా సంక్షేమాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వం విస్మరించిందని, ఈ విషయాన్ని అన్ని వర్గాల ప్రజలు, సమాజం నిశితంగా గమనిస్తుందన్నారు. తాను ఎమ్మెల్యేగా, మంత్రిగా ఉన్నప్పుడు నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధే కనిపిస్తుందన్నారు. అధికారంలో ఉన్న, ప్రతిపక్షంలో ఉన్న ప్రజల సమస్యలపైనే పోరాటం సాగించామని చెప్పారు. 50 ఏళ్లుగా గద్వాల ప్రజలు అండగా ఉన్నారని, ఇదే సహకారాన్ని కొనసాగించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రామచంద్రారెడ్డి, గడ్డం కృష్ణారెడ్డి, బండల వెంకట్రాములు, ఆనంద్, వెంకటేశ్వర్‌రెడ్డి, జాన్‌మగ్బూల్ తదితరులు పాల్గొన్నారు. ఇదిలాఉండగా, గద్వాల మండలం పరుమాలకి చెందిని యువకులు, మహిళలు బీజేపీలో చేరారు. డీకే అరుణ పార్టీ కండువాలు కప్పి బీజేపీలోకి ఆహ్వానించారు. రాష్ట్రంలో రానున్న ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి రావడమే ధ్యేయమని అన్నారు.



మాట్లాడుతున్న డీకే అరుణ